క్లుప్తంగా

రేపు రాజశ్యామల మహా యజ్ఞం



పాత గుంటూరు: ఏటుకూరు బైపాస్ రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో శనివారం భద్రకాళీ పీఠాధీశ్వరి సింధు మాతాజీ ఆధ్వర్యంలో రాజ శ్యామల మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు భవతారిణి ట్రస్ట్ సభ్యులు లంకదాసు ప్రసాదరావు తెలిపారు. బ్రాడీపేటలోని హోటల్లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహా యజ్ఞం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. 10న ఉదయం 4గంటలకు గోపూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రాత్రి 9 గంటల వరకు విశేష పారాయణాలు, కుంకుమార్చనలు, మంత్రపుష్పం, మహా పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి మాతాజీ ఆశీర్వచనం, ప్రసంగం, అతిథిలకు, ప్రముఖులకు అవార్డు ప్రదానోత్సవాలు ఉంటాయని వివరించారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో తల్లం శేఖర్, తల్లం సత్యనారాయణ, చెరుకూరి శ్రీనివాసరావు, పులిపాటి రాజేంద్ర ప్రసాద్, గోపాలకృష్ణ శ్రేష్ఠి పాల్గొన్నారు.

ఆశ్రమానికి బ్యాంక్ ఆఫ్ బరోడా వితరణ



కొరిటిపాడు (గుంటూరు): కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా నగరంపాలెం బ్రాంచి గురువారం పాత గుంటూరులోని శ్రీ ఆర్.ఆర్. మూర్తి వృద్ధుల ఆశ్రమానికి గురువారం 50 కుర్చీలు, 75 దుప్పట్లు, వృద్ధులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ నరేష్ పంగ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని వెల్లడించారు. వృద్ధుల్ని ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో బల్లిపల్లి వెంకటేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీపురం: రెడ్డిపాలెం, నంబూరు రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం – నంబూరు రైల్వే స్టేషన్ పరిధిలో సుమారు 45 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల విచారించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా నిర్ధారించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడు వివరాలు తెలిసిన వారు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు 9440627546, ఎస్ఐ జి.వెంకటాద్రి 7207076614 నంబర్లను సంప్రదించాలి.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

గుంటూరు మెడికల్: జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 10న 'విభజన చట్టం –ఆంధ్రప్రదేశ్ రైల్వే ప్రాజెక్టులు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి అవధానుల హరి గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ సమావేశ మందిరంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతా సేవ కుమార్, పలు పార్టీల నాయకులు, పలు రంగాల నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



గుంటూరు మెడికల్: కార్మిక సమస్యల్ని లేబర్ డిపార్ట్‌మెంట్‌కి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని గుంటూరు జిల్లా ది చాంబర్ ఆఫ్ కామర్స్ సబ్ కమిటీ లేబర్ అసోసియేషన్ చైర్మన్ కొత్తూరు వెంకటసుబ్బారావు తెలిపారు. శ్రామిక భారతి రాష్ట్ర అధ్యక్షుడిగా, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు మెంబర్‌గా పనిచేసిన తనను సబ్ కమిటీ లేబర్ అసోసియేషన్ చైర్మన్‌గా నియమించినందుకు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులుకు గురువారం ధన్యవాదాలు తెలిపారు. కార్మిక శాఖకు, వ్యాపారస్తులకు మధ్య వారధిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పజెప్పిన ఆతుకూరి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ చంద్రలకు ధన్యవాదాలు తెలిపారు.

ఓటర్ల దరఖాస్తులపై అప్రమత్తత అవసరం



సూపర్వైజరీ, బీఎల్ఓలతో సమావేశమైన అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి

అదనపు కమిషనర్ కె. రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: ఓటర్ల ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ రోల్) అనంతరం అందిన దరఖాస్తుల్ని బూత్ లెవల్ అధికారులు(బీఎల్ఓ) అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో కె.రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తూర్పు నియోజకవర్గ బీఎల్ఓలు, సూపర్వైజరీ అధికారులతో ఎన్నికల ఓటర్ల తుది జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం తుది జాబితా అనంతరం కూడా అనేక రకాల దరఖాస్తులు అందుతున్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. అనంతరం సూపర్వైజరీ అధికారులు సంతకం చేసి తదుపరి అనుమతుల కోసం ఏఈఆర్వోకి పంపాలని స్పష్టం చేశారు. ప్రధానంగా నూతన ఓట్ల చేర్పులు, తొలగింపు దరఖాస్తులు సూపర్వైజరీ అధికారులు, ఏఈఆర్వోలు నేరుగా పరిశీలించాలని ఆమె ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల్ని పరిశీలించి, అవసరమైన వాటి కోసం ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని బీఎల్ఓలకు చెప్పారు.పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై బాధ్యత తీసుకోవాలని సూపర్వైజరీ అధికారులకు ఆమె సూచించారు. సమావేశంలో ఏఈఆర్వోలు డి.వెంకటలక్ష్మి, ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, డెప్యూటీ తహసీల్దార్లు బి.భాస్కర్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే నిజమైన దేశాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణకుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: మహాత్ముని కలలు కన్న గ్రామాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని ఐటీసీ లీఫ్ డివిజన్ ఉపాధ్యక్షుడు టి. కృష్ణకుమార్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం 'గ్రామీణ వ్యవస్థాపకత–స్వాలంబన గ్రామీణ భారత దేశ నిర్మాణం 'అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ, గ్రామీణ రంగాభివృద్ధి, వాటి పునర్నిర్మాణానికి సరైన ప్రణాళిక, వ్యూహాలు అవసరమని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ రైతు ఎప్పుడైతే అభివృద్ధి దశలో ఉంటారో దేశాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ సంస్థల్లో కొన్ని సమస్యలు ఉన్నాయని, అందులో ప్రధానమైనవి పట్టణ ప్రాంత పరిశ్రమల నుంచి పోటీని తట్టుకునే శక్తి, నిరుద్యోగిత, సరైన సాంకేతికత లేకపోవడం వంటివి ఉన్నాయని చెప్పారు. వాటిని అధిగమించి నూతన భావాలతో గ్రామీణ అభివృద్ధి కొనసాగించాలని చెప్పారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర పశు వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పి.వి. సత్య గోపాల్ మాట్లాడుతూ గ్రామీణ రైతు ఎప్పుడైతే సంతోషంగా ఉంటారో అప్పుడే దేశం సంతోషంగా ఉంటుందని వివరించారు. గ్రామీణాభివృద్ధిలో యువత ప్రముఖ పాత్ర వహించాలని సూచించారు. సదస్సులో కళాశాల కరెస్పాండెంట్ కె.వి. బ్రహ్మం, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, సదస్సు డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర శాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు. వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పత్రాలు సమర్పించారు.

ఎన్ఎంఆర్‌లను క్రమబద్ధీకరించండి



గుంటూరు వెస్ట్: 1993 నవంబర్‌కు ముందు నుంచి విధులు నిర్వహిస్తున్న 2.931 మంది ఎన్ఎంఆర్‌లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి శాఖలో అప్పటి నుంచి ఎన్ఎంఆర్‌లు పని చేస్తున్నారని తెలిపారు. దాదాపు 30 ఏళ్లుగా పనిచేస్తున్న వీరిని క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని కోరారు.

మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్న సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టాభిపురంలో నివాసం ఉండే ఓ మహిళ ఫొటోల్ని వ్యక్తి మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్నాడు. గుర్తించిన మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వృద్ధుడి ఆత్మహత్య

వృద్ధుడి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారానికి చెందిన వెంకటరమణారెడ్డి (72) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు.

మనస్తాపంతో మహిళ...

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతీనగర్‌కు చెందిన మల్లెల అలేఖ్య (30) వ్యక్తిగత కారణాలతో మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు.

నగరంలో కలుషిత నీరు సరఫరా జరిగే ప్రసక్తే లేదు

- నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి
- వార్తా పత్రికలో వచ్చిన కథనం పూర్తిగా అవాస్తవం



సంగడిగుంటలో తాగునీటి శాంపిల్ సేకరిస్తున్న మెడికల్, నగరపాలక సంస్థ అధికారులు

నెహ్రూనగర్: నగరంలో కలుషితనీరు సరఫరా జరిగే ప్రసక్తే లేదని, నగరపాలసంస్థ పరిధిలోని రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నట్లు ఎస్ఈ సుందరరామిరెడ్డి తెలియజేశారు. కలుషిత నీరు తాగి డయేరియాతో ఒకరు మృతి చెందినట్లు ఓ వార్త పత్రికలో వచ్చిన కథనం పూర్తిగా అవాస్తమని ఖండించారు. సంగడిగుంట తిరుమల చారి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం ఇంజినీరింగ్ అధికారులు, మెడికల్ ల్యాబ్ ఫీల్డ్ ఆఫీసర్ శివ కుమార్ ఆధ్వర్యంలో తాగునీటి శాంపిల్స్ సేకరించారు. ప్రాథమికంగా తాగునీటిలో క్లోరిన్ తగు పాళల్లో ఉందని, నీరు కలుషితం కాలేదని ధ్రువీకరించారు. సంగడిగుంటకు తాగునీటి సరఫరా చేసే బీఆర్ స్టేడియం రిజర్వాయర్ సమీపంలో పైపుల మరమ్మతుల్ని పది రోజుల కిందట పూర్తి చేసినట్లు ఎస్ఈ తెలిపారు. కలుషిత నీరు సరఫరాకి, పైపు లైను మరమ్మత్తులకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. బీఆర్ స్టేడియం రిజర్వాయర్ని ఈనెల ఆరో తేదీన శుభ్రం చేసినట్లు చెప్పారు.

నిద్ర పట్టడం లేదా.. జీజీహెచ్‌కు పద !

- నాట్కో సంస్థ చొరవతో స్లీప్ ల్యాబ్ ఏర్పాటు
- మొట్టమొదటి ఆస్పత్రిగా రికార్డు
- ఉచితంగా వైద్య పరీక్షలు



స్లీప్ ల్యాబ్‌లో ఏర్పాటుచేసిన వైద్య పరికరం, మంచం

గుంటూరు మెడికల్: మీకు నిద్ర పట్టడం లేదా ? అయితే, గుంటూరు జీజీహెచ్‌కు రండి. ఈ మాట వినేందుకు ఆశ్చర్యంగా ఉన్నా నిజమే! నిద్ర పట్టక పోవడానికి కారణాలను వైద్య పరీక్షల ద్వారా తెలుసుకుని హాయిగా నిద్ర పోయేందుకు కావాల్సిన వైద్యాన్ని జీజీహెచ్ వైద్యులు అందిస్తారు. అందుకోసం న్యూరాలజీ వైద్య విభాగంలో 'స్లీప్ ల్యాబ్'ను దాతల సాయంతో ఏర్పాటు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో స్లీప్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిన మొట్ట మొదటి ప్రభుత్వ ఆస్పత్రిగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి రికార్డు సృష్టించింది. నాట్కో ఫార్మా కంపెనీ సంస్థ చైర్మన్ నన్నపనేని వెంకయ్య చౌదరి న్యూరాలజీ వార్డులో స్లీప్ ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన వైద్య పరికరాలు కొనుగోలు చేసేందుకు రూ.25 లక్షలు ఆర్థిక సాయం చేశారు.

నిద్ర సమస్యలకు చెక్

మనిషి జీవిత కాలంలో సగం సమయం నిద్రించేందుకే కేటాయిస్తున్నాడు. నిద్ర లేకపోతే ఏకాగ్రత లోపించడం, నిర్ణయం సకాలంలో తీసుకోలేకపోవడం, నిరాశ, నిస్సత్తువ, నీరసం, విసుగు, తలనొప్పి, ఇతర రుగ్మతలు తలెత్తుతాయి. ఫిజికల్‌గా, మెంటల్‌గా, ఎమోషనల్‌గా మనిషి ఫిట్‌గా ఉండడు. కనీసం మనిషి ఎనిమిది గంటలు నిద్రపోని పక్షంలో పైన పేర్కొన్న రుగ్మతలతోపాటు హార్ట్‌ఎటాక్ సైతం వచ్చే అవకాశాలు ఉన్నట్లు వైద్యనిపుణులు తెలియజేశారు. కాఫీ, టీలు ఎక్కువగా తీసుకునేవారిలో నిద్ర పట్టదు. ఊబకాయం ఉన్నవారు సైతం రాత్రిళ్లు గురక పెడుతూ మధ్యలో నిద్రాభంగంతో లేస్తుంటారు. నిద్రలో లేచి నడవడం, సైకిల్ తొక్కినట్లు కాళ్లు కదిలించడం, ఫిట్స్ రావడం వల్ల వారు నిద్రపోవడానికి భయపడతారు.

రుగ్మతల నిర్ధారణకు స్లీప్ ల్యాబ్

నిద్ర రుగ్మతలు రావడానికి గల కారణాలు నిర్ధారించేందుకు స్లీప్ ల్యాబ్ ఉపయోగపడుతుందని న్యూరాలజీ వైద్య విభాగాధిపతి తెలిపారు. కొంత మంది రాత్రివేళలో నిద్రపోరని, పగటి పూట నిద్రిస్తుంటారని, దీని వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్‌ల గురించి వారికి తెలియదని తెలిపారు. ఏ సమయాల్లో నిద్రపోవాలి, పోకపోతే ఎలాంటి అనర్థాలు తలెత్తుతాయి తదితర విషయాలను స్లీప్ డిజార్డర్‌తో బాధపడేవారికి ల్యాబ్‌లో వైద్య పరీక్షలు చేసి వివరించనున్నట్లు డాక్టర్ సుందరాచారి వెల్లడించారు. నిద్ర పట్టకపోవడానికి గల కారణాలు తెలుసుకోవడం ద్వారా సమస్యను త్వరితగతిన సులువుగా నయం చేయవచ్చని, అందుకోసం స్లీప్ ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

రాత్రి వేళల్లో వైద్య పరీక్షలు

ఒక్కో వ్యక్తికి వైద్య పరీక్ష చేసేందుకు సుమారు ఎనిమిది గంటలకు పైగా సమయం పడుతుంది. సుమారు 30 నుంచి 40 వరకు వైర్లు శరీరంలో వివిధ భాగాలకు అతికించి పరీక్ష చేస్తారు. రాత్రి వేళల్లో సహజ సిద్ధంగా నిద్రించే సమయంలో ఈ పరీక్ష నిర్వహించడం ద్వారా కచ్చితమైన ఫలితాలు వస్తాయి. రాత్రి 9.30 గంటల నుంచి తెల్లవారు జామున 6గంటల వరకు వైద్య పరీక్షలు చేస్తారు. ఆస్పత్రి ఓపీ విభాగంలో మంగళవారం, గురువారం, శనివారం న్యూరాలజీ విభాగానికి వచ్చిన వారికి నిద్ర సమస్యలు ఉంటే స్లీప్ ల్యాబ్‌లో పరీక్ష చేసి వైద్యసేవలను అందిస్తారు. పరీక్షలు చేసే సమయంలో ప్రత్యేక శిక్షణ పొందిన న్యూరో టెక్నీషియన్‌తోపాటుగా ఒక డాక్టర్, అటెండెంట్ రోగి వద్దే ఉంటారు. నిద్ర సమస్యలపై పరిశోధన చేసేందుకు ఒక పీజీ డాక్టర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

రోజురోజుకూ పెరుగుతున్న నిద్ర సమస్యలు



ఆధునిక జీవన శైలి వల్ల నేడు నిద్ర సమస్యతో బాధపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. నిద్ర సమస్యల్ని గుర్తించి వాటిని నివారించేందుకు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్లీప్ ల్యాబ్‌లో ప్రతి రోజూ ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని నిద్ర సమస్యల నుంచి విముక్తి పొందవచ్చు. 2018 నుంచి స్లీప్ ల్యాబ్‌లో ఉచితంగా వైద్య పరీక్షల చేస్తున్నాం. ప్రతి నెలా ఐదుగురు బాధితులు వైద్య సేవలు పొందుతున్నారు.

– డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, న్యూరాలజీ వైద్యవిభాగాధిపతి, జీజీహెచ్



స్లీప్ ల్యాబ్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన బోర్డు



రోగిని పరీక్షిస్తున్న సమయంలో కంప్యూటర్‌లో నమోదు అయిన గణాంకాలు

నేడు డిగ్రీ విద్యార్థులకు పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వ జాతీయ గణాంక కార్యాలయ ఆధ్వర్యంలో సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జిల్లాలోని పలు డిగ్రీ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులకు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ''అధికారిక గణాంకాల వ్యవస్థ – ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ,ఉపాధి అవకాశాల''పై చర్చతో పాటు క్విజ్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా ఉప ప్రాంతీయ కార్యాలయ గణాంక అధికారి ఈ.హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న విమలారెడ్డి

వైఎస్. విమలారెడ్డి

పాత గుంటూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి సోదరి వై.ఎస్. విమలారెడ్డి అన్నారు. తూర్పు నియోజకవర్గం పొన్నూరు రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాలులో గురువారం దైవ సేవకులు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్.విమలారెడ్డి, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విమలారెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరువవుతున్న తీరు చూస్తుంటే రానున్న ఎన్నికల్లో జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, పాస్టర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జీజీహెచ్ అధికారులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ జి.ఆశా తెలిపారు. ఇటీవల ఆసుపత్రి రైల్వే స్టేషన్ గోడ వద్ద పరిశుభ్రంగా ఉంచాల్సిందిగా నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో గురువారం నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ జి.ఆశా ఆసుపత్రిని పరిశీలించారు. అధ్వానంగా ఉన్న ఆ ప్రాంతాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో నెలకున్న వాతావరణాన్ని డాక్టర్ సతీష్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ ఆమెకు వివరించారు. రెండు, మూడు రోజుల్లో ఆసుపత్రి గోడకు ఆనుకొని ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని ఆశా తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, నర్సింగ్ సూపెరింటెండెంట్లు కె. ఆశా సజని, గంగమ్మ, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య రంగాభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలి



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, సుబ్బారావును సన్మానిస్తున్న హెచ్ఎం అసోసియేషన్ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన లింగేశ్వరరెడ్డిని కలిసిన హెచ్ఎంలు ఆయనతో పాటు ఇప్పటి వరకు ఆర్జేడీగా పని చేసి బదిలీ అయిన వీఎస్ సుబ్బారావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆర్జేడీని కలిసిన వారిలో హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ. తిరుమలేష్, గౌరవాధ్యక్షుడు జె.సురేష్‌కుమార్, నాయకులు గుత్తా శ్రీనివాసరావు, సీజే మణికుమార్, ఎన్వీ నాగమణి, కె. వీరాస్వామి, టి. శ్రీధర్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం ఉన్నారు.

విలువలతో కూడిన విద్యతోనే సమాజాభివృద్ధి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంగాదేవి, రాజేశ్వర్ రాజేష్, రఘురామ్

గుంటూరు ఎడ్యుకేషన్: విలువలతో కూడిన విద్యే సమాజాభివృద్ధికి బీజం వేస్తుందని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ రాజేశ్వర్ రాజేష్ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో గురువారం 49వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేశ్వర్ రాజేష్ మాట్లాడుతూ విద్యావంతులతోనే దేశ ప్రగతి సాధ్యమని తెలిపారు. విద్యార్థి మనోవికాసానికి దోహదం చేసేలా విద్య ఉండాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో బాలకుటీర్ ఇదే విధంగా నాణ్యమైన విద్యా విధానంతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఆకాశవాణి డైరెక్టర్ ఎం.కృష్ణకుమారి మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే మానసిక వికాసం సాధ్యమని తెలిపారు. బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రుల సహకారంతోనే పిల్లల సంపూర్ణ వికాసం సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాలకుటీర్ ఉపాధ్యక్షుడు రావెల సాంబశివరావు, డీఈవో పి. శైలజ, పాఠశాల సహ కార్యదర్శి జయశ్రీ , సీఏవో దుర్గా రఘురామ్, ప్రిన్సిపాల్ సుధామాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుండె రోగులకు అండగా 'బజరంగ్'

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు
- బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



యాంజియోగ్రామ్ పరీక్షలు చేయించుకున్న నంబూరు గ్రామస్తులు

పెదకాకాని: మండలంలోని నంబూరులో ఈనెల 4, 5వ తేదీలలో బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమం ద్వారా జరిగిన మీ గుండె పదిలం శిబిరంలో గుండె సంబంధిత వైద్య శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 45 మందిని గుర్తించారు. వారిలో రెండవ విడతగా 10 మందిని ప్రత్యేక బస్సులో విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా గురువారం బజరంగ్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ యాంజియోగ్రామ్‌కు హాజరైన రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షలో తొమ్మిది మంది ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉండగా ఒకరికి బైపాస్ సర్జరీ అవసరమున్నట్లు వైద్యులు గుర్తించినట్లు చెప్పారు. బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తూ సకాలంలో వైద్య సహాయం అందేందుకు తోడ్పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని మరిన్ని గ్రామాలకు తీసుకువెళతానన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ ఉయ్యూరు సతీష్‌రెడ్డి, బజరంగ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

గుంటూరు రూరల్: ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి తెలిపారు. గురువారం 26వ డివిజన్ సీఆర్ కాలనీలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.